

ఈనాడు చదువు

బుధవారం
ఏప్రిల్ 4, 2018
హైదరాబాద్

■ e-mail: edc@eenadu.in

బోధన రంగం ఇప్పుడు ఎంతో ఆకర్షణీయమైన కెరియర్. ప్రపంచ పోకడలూ, ఆర్థిక మాంద్యం లాంటి చిక్కులతో సంబంధం లేకుండా ఎప్పుడూ ఒకేలాంటి గిరాకీ ఉండటం దీని ప్రత్యేకత. ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉన్నవారు అత్యున్నత శిక్షణ ఇచ్చే ప్రముఖ విద్యాసంస్థల్లో ప్రవేశం కోసం ప్రయత్నించటం మేలు. ఈ విద్యాసంస్థలేమిటి? వాటి ప్రవేశాల తీరుతెన్నులు ఎలా ఉంటాయో తెలుసుకుందాం.

ఉపాధ్యాయ శిక్షణకు ఉత్తమ మార్గాలు

సమాజంలో ఏమాత్రం హోదా తగ్గనిదిగా ఉపాధ్యాయ వృత్తికి పేరుంది. ఈ బోధన రంగంలో ఉన్నవారు తమ ప్రభావాన్ని విద్యార్థుల జీవిత పర్యంతం కలగజేయగలుగుతారు. అందుకే ఇదెంతో గౌరవప్రదమైనదిగా పేరుపొందింది. అయితే ఈ వృత్తిలో ఎవరైనా సరే, తేలిగ్గా రాణిస్తారని భావిస్తే అది అపోహే. నిరంతరం నేర్చుకోవటంపై నిజమైన ప్రేమ ఉండి సహనం, భావప్రసార సామర్థ్యం లాంటివి ఉంటే విజయవంతం కాగలుగుతారు.

గణితం, చరిత్ర, ఆంగ్లం.. దేన్ని బోధించేవారైనా తమ సబ్జెక్టులో ఒకవైపు బోధిస్తూనే మరోవైపు దాని తాజా అంశాలను నేర్చుకుంటుంటేనే దానిలో గణనీయస్థాయిని సాధించటానికి వీలుంటుంది. ఇలా వ్యక్తిగత, వృత్తిపరమైన సంతృప్తిని అందించే తక్కువ కొలువుల్లో ఉపాధ్యాయ ఉద్యోగం ముందు వరసలో ఉంటుంది.

ఉపాధ్యాయ వృత్తిలో ప్రవేశించాలంటే.. డిప్లొమా ఇన్ ఎడ్యుకేషన్ (డీఎడ్) లేదా బ్యాచిలర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఎడ్) తప్పనిసరి అనేది అందరికీ తెలిసిన విషయమే. బీఎడ్ కోర్సును పేరున్న సంస్థల్లో చదివినవారు బోధన నైపుణ్యాలను బాగా ఆకళింపు చేసుకోగలరు. దీంతో ఉపాధ్యాయ కొలువును సులువుగానే పొందటం సాధ్యమవుతుంది.

రీజనల్ ఇన్‌స్టిట్యూట్లు

సమాజానికి అత్యుత్తమ ఉపాధ్యాయులను అందించాలనే సమున్నత లక్ష్యంతో ప్రాంతీయ విద్యాసంస్థలు (రీజనల్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ ఎడ్యుకేషన్ - ఆర్ఈఐ) దేశవ్యాప్తంగా ఏర్పాటయ్యాయి. దేశ విద్యారంగ మార్పుల మూలంగా వచ్చే సవాళ్ళను స్వీకరించి తగిన మార్గదర్శనం చేసే సంస్థలివి. వీటిని గతంలో రీజనల్ కాలేజెస్ ఆఫ్ ఎడ్యుకేషన్ అనేవారు. ఇది న్యూదిల్లీలోని ఎన్‌సీఈఆర్‌టీకి చెందిన కాన్‌స్టిట్యూయెంట్ యూనిట్. పాఠశాల, బోధన విద్యకు సంబంధించి శ్రేష్ఠమైన విద్యాసంస్థలవి.

ఇంటర్ అర్హతతో ఇక్కడ డిగ్రీతోపాటు బీఎడ్‌ను నాలుగేళ్ళలోనే పూర్తిచేయవచ్చు. దీంతోపాటు రెగ్యులర్ బీఎడ్, ఎంఎడ్, ఇంటిగ్రేటెడ్ ఎమ్మెస్సీ ఎడ్, ఎడ్యుకేషన్‌లో పీహెచ్‌డీ కోర్సులను ఆర్ఐఈలు అందిస్తున్నాయి.

ఇంటర్ తర్వాత నేరుగా బీఎడ్

సాధారణంగా ఉపాధ్యాయ వృత్తిపై ఆసక్తి ఉన్నవారు ఇంటర్ తర్వాత డీఎడ్ కోర్సుల్లో చేరతారు. మరికొందరు డిగ్రీ తర్వాత బీఎడ్ చదువుతారు. ఈ రెండూ రెండేళ్ళ వ్యవధితో నిర్వహించేవే. అయితే ప్రాంతీయ విద్యాసంస్థల్లో (ఆర్ఐఈ) మాత్రం ఇందుకు భిన్నమైన పరిస్థితి ఉంది. ఇక్కడ డీఎడ్ ఉండదు. కానీ ఇంటర్ తర్వాత నేరుగా బీఎడ్ కోర్సుల్లో చేరిపోవచ్చు. అంటే బీఏ లేదా బీఎస్సీ డిగ్రీతోపాటు బీఎడ్ కలిసి చదువుకోవచ్చు. నాలుగేళ్ళలోనే కోర్సు పూర్తి కావడం మరో ప్రత్యేకత. డిగ్రీ తర్వాత బీఎడ్ చేయడంతో పోల్చుకుంటే ఇంటర్ విద్యార్థులు ఈ కోర్సులో చేరటం ద్వారా ఏడాది సమయం ఆదా అవుతుంది. అంతే కాకుండా వరుసగా నాలుగేళ్లపాటు చదవటం వల్ల సబ్జెక్టుపై పూర్తిపట్టు లభిస్తుంది. ముఖ్యంగా మెథడాలజీలో నైపుణ్యం ఎంతో మెరుగవుతుంది. ఈ కారణంవల్ల బోధన వృత్తిలోకి ప్రవేశించాలనుకునేవారు ఆర్ఐఈల్లో చేరడానికి ప్రాధాన్యం ఇవ్వడం ఉత్తమం.

దేశవ్యాప్తంగా అజ్మీర్, భువనేశ్వర్, భోపాల్, మైసూరు, షిల్లాంగ్, ఝజ్జర్- ప్రారంభ్ (హరియాణ)ల్లో ఆర్ఐఈలున్నాయి. ఒక్కో సంస్థ పరిధిలోకి కొన్ని రాష్ట్రాలు వస్తాయి. మన తెలుగు రాష్ట్రాలు మైసూరు కిందకి వస్తాయి. అంటే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విద్యార్థులకు ఇక్కడ మాత్రమే చదువుకునే అవకాశముంది. మనతోపాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలైన పుదుచ్చేరి, లక్షద్వీప్ ఆర్ఐఈ మైసూరు పరిధిలోకి వస్తాయి. సీట్ల కేటాయింపు కూడా రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలవారీగా విభజించారు.

ఇక్కడ బీఎస్సీ బీఎడ్ (ఎంపీసీ)లో 40 సీట్లు, బీఎస్సీ బీఎడ్ (బైపీసీ)లో 40 సీట్లు, బీఏ బీఎడ్‌లో 40 సీట్లు ఉన్నాయి.

ఆరేళ్ల ఎమ్మెస్సీ ఎడ్

వీటితోపాటు ఎమ్మెస్సీ ఎడ్ కోర్సు ఒక్క ఆర్ఐఈ మైసూరులో మాత్రమే ఉంది. దీని వ్యవధి ఆరేళ్లు. సాధారణంగా ఇంటర్ తర్వాత డిగ్రీ, పీజీలకు ఐదేళ్ళు అవసరం. అలాగే బీఎడ్ చేయాలంటే రెండేళ్ళు. మొత్తం ఏడేళ్లవుతాయి. ఇంటర్ తర్వాత నేరుగా పీజీతో పాటు బీఎడ్ పూర్తికావటం ఈ కోర్సు ప్రత్యేకత. దీంతో ఏడాది సమయం ఆదా అవుతుంది.

ఎమ్మెస్సీ ఎడ్‌లో మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ ఒక్కో సబ్జెక్టులో 15 చొప్పున సీట్లు ఉన్నాయి. వీటికోసం దేశవ్యాప్తంగా ఎవరైనా పోటీ పడవచ్చు. రాష్ట్రాల కోటా వర్తించదు. అలాగే ఆరేళ్ళలోపు మధ్యలో వైదొలగడమూ కుదరదు. ఎమ్మెస్సీ ఎడ్ కోర్సు పూర్తిచేసిన వారు మైసూరులోనే ఎడ్యుకేషన్‌పై పీహెచ్‌డీ చేసుకునే సౌలభ్యం కల్పిస్తున్నారు.

సాధారణ బీఎడ్ సైన్స్, మ్యాథ్స్ విభాగంలో 25, సోషల్ సైన్స్, లాంగ్వేజిల్లో 25 చొప్పున ఆర్ఐఈ మైసూరులో సీట్లు ఉన్నాయి. ఇది డిగ్రీ అనంతర కోర్సు. వ్యవధి రెండేళ్ళు. ఎంఎడ్ కోర్సులో 30 సీట్లు ఉన్నాయి. దీని వ్యవధీ రెండేళ్ళే.

ఇంటిగ్రేటెడ్ బీఎడ్ + ఎంఎడ్

ఈ విశిష్ట కోర్సు ఆర్ఐఈ భోపాల్‌లో మాత్రమే అందిస్తున్నారు. ఇందులో 40 సీట్లు ఉన్నాయి. కోర్సు వ్యవధి మూడేళ్ళు. ఈ కోర్సు ఒక్క భోపాల్‌లోనే ఉంది కాబట్టి దేశవ్యాప్తంగా ఎవరైనా ఈ సీట్లు కోసం పోటీ పడవచ్చు. ఎలిమెంటరీ, సెకండరీ, సీనియర్ సెకండరీ ఎడ్యుకేషన్‌లలో దేన్నైనా స్పెషలైజేషన్‌గా ఎంచుకోవచ్చు.

ఆర్ఐఈల్లో చేరిన ఎస్సీ, ఎస్టీలందరికీ ఉపకార వేతనాలు లభిస్తాయి. మిగిలిన అభ్యర్థుల్లో సగం మందికి తల్లిదండ్రుల వార్షికాదాయం ప్రాతిపదికన వీటిని అందజేస్తారు. ఇక్కడి విద్యార్థులకు ఏటా క్యాంపస్ నియామకాలు జరుగుతాయి. బీఏ/బీఎస్సీ ఎడ్ లేదా బీఎడ్ కోర్సులు చదువుకున్నవారికి నెలకు కనీసం రూ.25 వేలకు పైగా వేతనం లభిస్తుంది. ఎమ్మెస్సీ ఎడ్, ఎంఎడ్ కోర్సుల వారికి కనీసం రూ.35 వేల చొప్పున చెల్లిస్తారు. కార్పొరేట్ పాఠశాలలు ఇక్కడి విద్యార్థులను ఉద్యోగాల్లో నియమించుకుంటున్నాయి.

ప్రకటన వచ్చేసింది

దేశవ్యాప్తంగా ఉన్న వివిధ ఆర్ఐఈలలో ఎడ్యుకేషన్ కోర్సుల ప్రవేశానికి తాజాగా ప్రకటన వెలువడింది.

● **రీజనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎడ్యుకేషన్ (ఆర్ఐఈ) కామన్ ఎంట్రన్స్ ఎగ్జామ్ (సీఈఈ)–2018.**
కోర్సులు: 1) **ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఈడీ, ఇంటిగ్రేటెడ్ బీఏ బీఈడీ, కాలవ్యవధి:** నాలుగేళ్ళు **అర్హత:** సంబంధిత సబ్జెక్టుల్లో ఇంటర్ ఉత్తీర్ణత.

● **ఎమ్మెస్సీ ఎడ్యుకేషన్, కాల వ్యవధి:** ఆరేళ్ళు **అర్హత:** ఫిజిక్స్, కెమిస్ట్రీ, మ్యాథ్స్ సబ్జెక్టులతో ఇంటర్ ఉత్తీర్ణత

● **ఎంఈడీ, కాలవ్యవధి:** రెండేళ్ళు **అర్హత:** సంబంధిత సబ్జెక్టులతో బీఈడీ/బీఏ ఎడ్యుకేషన్/బీఎస్సీ ఎడ్యుకేషన్ ఉత్తీర్ణత.

● **బీఈడీ (సైన్స్ అండ్ మ్యాథ్స్), బీఈడీ (ఇంగ్లిష్ అండ్ సోషల్ సైన్స్), కాలవ్యవధి:** రెండేళ్ళు **అర్హత:** బీఏ/బీఎస్సీ/ఎంఏ/ఎంఎస్సీ ఉత్తీర్ణత **ఎంపిక:** ప్రవేశపరీక్ష (ఆర్ఐఈ సీఈఈ) ద్వారా

ప్రవేశపరీక్ష తేదీ: 10.6.2018 **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకోవాలి. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ:** 9.5.2018

వెబ్‌సైట్: www.ncert-cee.kar.nic.in

ప్రవేశపరీక్ష ఎలా?

రాతపరీక్షకు 60 శాతం, అర్హతకు సంబంధిత పరీక్షలో సాధించిన మార్కులకు 40 శాతం వెయిటేజి ఇస్తారు. పరీక్షలో భాషా నైపుణ్యాలు, టీచింగ్ ఆప్టిట్యూడ్, రీజనింగ్ ఎబిలిటీ అంశాల నుంచి మొత్తం 80 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష వ్యవధి 2 గంటలు. ●

సెంట్రల్ యూనివర్సిటీల్లో...

బోధన రంగానికి సంబంధించి ప్రత్యేకమైన కోర్సులను కేంద్రీయ విశ్వవిద్యాలయాలు అందిస్తున్నాయి. తమిళనాడు సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఎడ్‌నూ, సౌత్ బిహార్ సెంట్రల్ యూనివర్సిటీ ఇంటిగ్రేటెడ్ బీఎస్సీ బీఎడ్, ఇంటిగ్రేటెడ్ బీఏ బీఎడ్ కోర్సులనూ ఆఫర్ చేస్తున్నాయి. సీయూసెట్ ద్వారా వీటిలో ప్రవేశం దొరుకుతుంది. కోర్సు వ్యవధి నాలుగేళ్ళు. పరీక్షలు ఏప్రిల్ 28, 29 తేదీల్లో నిర్వహిస్తారు. https://cucet.exam.in

అజీం ప్రేమ్‌జీ యూనివర్సిటీలో...

సుప్రసిద్ధ అజీం ప్రేమ్‌జీ విశ్వవిద్యాలయం రెసిడెన్షియల్ విధానంలో ఈ ఏడాది నుంచి బీఎస్సీ బీఎడ్ డ్యూయల్ డిగ్రీ కోర్సును ఆరంభిస్తోంది. వ్యవధి నాలుగు సంవత్సరాలు.

బయాలజీ, కెమిస్ట్రీ, ఫిజిక్స్; మ్యాథ్స్, ఫిజిక్స్, కెమిస్ట్రీ స్ట్రీముల్లో ఈ కోర్సును నిర్వహిస్తున్నారు. ఇంటర్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్లో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు అర్హులు. పరీక్ష, ఇంటర్వ్యూల ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు. తెలుగు రాష్ట్రాల్లో హైదరాబాద్‌లో పరీక్ష కేంద్రం ఉంది. ఈ సంస్థ ఎంఎడ్ కోర్సును కూడా అందిస్తోంది. ప్రవేశాలకు ప్రకటన వెలువడింది.

ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేదీ: ఏప్రిల్ 30.

వెబ్‌సైట్: http://azimpremjiuniversity.edu.in

గాంధీ గ్రామ్ రూరల్ ఇన్‌స్టిట్యూట్లో....

కేంద్ర మానవవనరుల శాఖ ఆధ్వర్యంలో తమిళనాడులోని గాంధీ గ్రామ్‌లో ఈ సంస్థను ఏర్పాటుచేశారు. దీనిలో ఇంటిగ్రేటెడ్ విధానంలో బీఎస్సీ బీఎడ్ కోర్సును అందిస్తున్నారు. ప్రవేశాల ప్రకటన వెలువడుతుంది. ఇంటర్ ఎంపీసీ గ్రూపులో 50 శాతం మార్కులతో ఉత్తీర్ణులైనవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

వెబ్‌సైట్: www.ruraluniv.ac.in

బీఏ/బీఎస్ ఎడ్‌ని ఇంటిగ్రేటెడ్ విధానంలో అందించే మరికొన్ని సంస్థలు

- ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టీచర్ ఎడ్యుకేషన్, గుజరాత్
- శంబల్‌పూర్ యూనివర్సిటీ
- లవ్లీ ప్రొఫెషనల్ యూనివర్సిటీ
- తేజ్‌పూర్ యూనివర్సిటీ
- సావిత్రీబాయి పూలే పుణే యూనివర్సిటీ
- జీడీ గోయంకా యూనివర్సిటీ

చదువుల తీరుతెన్నులు రోజురోజుకీ మారిపోతున్నాయి. మెషిన్ లర్నింగ్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కంప్యుటేషనల్ లర్నింగ్, కంప్యూటర్ విజన్, డీప్ లర్నింగ్, క్లౌడ్ కంప్యూటింగ్... ఇలా ఎన్నో కొత్త కొత్త కోర్సులు పుట్టుకొస్తున్నాయి. ఇప్పటి హైస్కూల్ విద్యార్థుల తల్లిదండ్రులకు ఈ పదాల పరిచయం కూడా ఉండదు. మరి తమ పిల్లలు ఇంజినీరింగ్, ఇతర డిగ్రీల స్థాయికి వచ్చేసరికి ఈ చదువులు ఇంకెలా ఉంటాయో? గ్రామీణ నేపథ్యం ఉన్న అభ్యర్థులు అసలు అందుకోగలుగుతారా... అనే సందేహాలు సహజం. అందుకే ట్రిపుల్ ఐటీలాంటి సంస్థలు కొన్ని రకాల నైపుణ్యాలను ఇప్పటి విద్యార్థులకు నేర్పించేందుకు సమ్మర్‌లో కోర్సులు నిర్వహిస్తున్నాయి. రాబోయే రోజుల్లో చదవబోయే చదువులకు, చేయబోయే ఉద్యోగాలకు అవసరమైన కంప్యుటేషనల్ థింకింగ్ లాంటి స్కిల్స్‌ను ఇప్పుడే పిల్లలకు అందిస్తున్నాయి.

తార్కిక ఆలోచనలకు

పదును పెట్టే స్టెప్!

◆ ట్రిపుల్ ఐటీ వేసవి శిక్షణ కార్యక్రమం ◆ ఏడు నుంచి పది తరగతుల విద్యార్థులకు

ఉదయం నిద్ర లేచింది మొదలు రాత్రి మళ్లీ పడుకునే వరకు మన జీవితాన్ని అడుగడుగునా టెక్నాలజీనే నడిపిస్తోంది. దాదాపు ప్రతి సమస్య పరిష్కారానికి కంప్యూటర్‌పై ఆధారపడుతున్నాం. గ్యాడ్జెట్లు జీవనశైలిలో అంతర్భాగమయ్యాయి. జటిల సమస్యలకు సులువుగా సమాధానాలను కంప్యూటర్లు అందిస్తాయి. అయితే అవి ఎలా పనిచేస్తాయి, పరిష్కారం ఏవిధంగా లభిస్తుంది అనే అంశాలపై మనకు సరైన అవగాహన ఉండాలి. అప్పుడే వాటిని సరిగా వినియోగించుకోగలుగుతాం. అందుకు మనకు కంప్యుటేషనల్ థింకింగ్ అవసరం. దాన్ని పాఠశాల స్థాయి నుంచి అభివృద్ధి చేసే క్రమంలో భాగంగా ఒక ప్రోగ్రామ్‌ను హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ నిర్వహిస్తోంది.

సమస్యలను తార్కికంగా ఆలోచించి, విశ్లేషించి వాటికి సరైన సమాధానాలను కనుక్కునే సామర్థ్యాన్ని పెంపొందించే విధానాన్ని కంప్యుటేషనల్ థింకింగ్‌గా చెప్పుకోవచ్చు. తెలుగులో ఈ పదానికి గణన ఆలోచనా విధానం లేదా గణన పద్ధతులను సమానార్థాలుగా భావించవచ్చు. ఈ పదం వినగానే ఇది కంప్యూటర్ సైన్స్ రంగానికి లేదా ఇన్ఫర్మేషన్ అండ్ కమ్యూనికేషన్ టెక్నాలజీకి సంబంధించిన అంశంగా అపోహపడే అవకాశం ఉంది. కానీ ఇది కేవలం ఈ విభాగాలకే పరిమితం కాదు. అన్ని రంగాలకూ అవసరమైనదే.

ఒక జటిలమైన, సంక్లిష్టమైన సమస్యను నిర్వహణకు అవకాశం ఉన్న స్థాయికి చిన్న చిన్న ఉప సమస్యలుగా విభజించాలి. వాటిని క్షుణ్ణంగా విశ్లేషించి, ఇంతకు పూర్వం ఇటువంటి సమస్యలకు సాధించిన ఫలితాలతో పోల్చాలి. సామ్యాన్ని గ్రహించాలి. ఒక సర్వసాధారణమైన క్రమసూత్ర పద్ధతిని (అల్గారిథమ్) పెంపొందించాలి. ఇలా ఈ ఉప సమస్యల పరిష్కారానికి ఉపయోగపడే నియమావళిని పెంపొందించే సామర్థ్యాన్ని వృద్ధి చేయడమే కంప్యుటేషనల్ థింకింగ్ (సీటీ) పదానికి నిర్వచనంగా భావించవచ్చు. ఈ ప్రక్రియలో అనవసరమైన, సమాధాన పద్ధతుల అభివృద్ధికి దోహదపడని అంశాలను వదిలేస్తారు. అంటే అవసరంలేని అంశాలను జల్లెడ పట్టడమని అర్థం. దీనికి అబ్‌స్ట్రాక్షన్ అని పేరు. ఈ మెలకువను పాఠశాల స్థాయిలోనే పెంపొందించాల్సిన అవసరం ఎంతో ఉంది. సబ్జెక్టులతో సంబంధం లేకుండా తార్కికమైన ఆలోచనా విధానం, అన్ని రకాల సమస్యల పట్ల సమగ్ర అవగాహన విద్యా విధానంలో అంతర్భాగమై ఉండాలి. ఈ అవసరాన్ని గుర్తించిన హైదరాబాద్‌లోని ప్రముఖ విద్యా సంస్థ ట్రిపుల్ ఐటీ ఏడు నుంచి పది తరగతులు చదువుతున్న విద్యార్థుల కోసం శిక్షణ కార్యక్రమాలను నిర్వహిస్తోంది. స్టూడెంట్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్ (స్టెప్) అనే పేరుతో జరగనున్న ఈ వేసవి శిక్షణ కార్యక్రమాలను విద్యార్థులు ఉపయోగించుకోవచ్చు.

కోర్సుల వివరాలు

ఏడు నుంచి పది తరగతుల వారి కోసం రెండు రకాల కోర్సులను అందిస్తున్నారు. ముందు వచ్చిన వారికి ప్రాధాన్యం పద్ధతిన అడ్మిషన్లు నిర్వహిస్తారు. నిర్ణీత వయసు ఉన్న విద్యార్థులందరూ ఈ కోర్సులో చేరవచ్చు.

సీటీఏ: మొదటి కోర్సు కంప్యుటేషనల్ థింకింగ్ అండ్ ఇట్స్ అప్లికేషన్స్ (సీటీఏ). ఇది ఏడు, ఎనిమిది తరగతుల వారి కోసం. కోర్సు ఫీజు రూ. 12,000. జీఎస్టీ అదనం. ఇందులో కంప్యుటేషనల్ థింకింగ్‌కి సంబంధించి మౌలికాంశాలను సులభమైన పద్ధతుల్లో విద్యార్థులకు వివరిస్తారు. సిద్ధాంతపరమైన బోధనతోపాటు చిన్న చిన్న టాస్క్‌లను చేయించి సమస్యలకు కొత్త కొత్త పరిష్కారాలను కనుగొనే విధంగా ప్రోత్సహిస్తారు. విద్యార్థుల అభిరుచి, ఆసక్తుల మేరకు ప్రాజెక్ట్ చేయిస్తారు. అందులో కంప్యుటేషనల్ థింకింగ్ టూల్స్, టెంప్లేట్స్ వినియోగించే సామర్థ్యాన్ని అభ్యర్థులు పొందుతారు.

సీటీపీఎస్: రెండోది కంప్యుటేషనల్ థింకింగ్ అండ్ ప్రాబ్లమ్ సాల్వింగ్ (సీటీపీఎస్). ఇది తొమ్మిది, పదో తరగతి విద్యార్థుల కోసం. ఫీజు రూ. 15,000. జీఎస్టీ అదనం. ఇందులో అభ్యర్థిలో కంప్యుటేషనల్ ఆలోచనా విధానాన్ని వృద్ధి చేస్తారు. సమస్యా పరిష్కార శక్తి, సరైన నిర్ణయ సామర్థ్యం, విశ్లేషణ నైపుణ్యాలను పెంపొందించే విధంగా శిక్షణ కార్యక్రమాన్ని రూపొందించారు. ఇందులోనూ విద్యార్థులతో ప్రాజెక్ట్ చేయిస్తారు.

కంప్యూటర్లు, కంప్యుటేషనల్ థింకింగ్ వంటి సాంకేతిక పదాలను విన్నప్పుడు సాధారణంగా చాలామంది అనుకూలంగా స్పందించరు. వాస్తవానికి తార్కిక ఆలోచనా విధానం మన దైనందిన జీవితంలో అన్ని మౌలిక చర్యల్లోనూ అవసరం అంటున్నారు ఈ కార్యక్రమ పర్యవేక్షక అధికారి ఆచార్య సోమపాల్. ఇంటిలో చేసే వంట నుంచి రాకెట్ సైన్స్ వరకు అంతా లాజికల్ థింకింగ్ పైనే నడుస్తోందని పేర్కొంటున్నారు. విద్యార్థులను కేవలం పుస్తకాలకు, ప్రశ్నోత్తరాల పద్ధతిలో సాగే విద్యకు పరిమితం చేయకూడదు. ఇలాంటి వైజ్ఞానిక పద్ధతులకు అలవాటు చేయడమే స్టెప్ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. విద్యార్థులను రోబోటిక్స్ ప్రయోగ కేంద్రం వంటి రిసెర్చ్ సెంటర్‌లకు తీసుకెళ్లి విద్యా విధానం పట్ల అవగాహన ఏర్పరచాలి. దానివల్ల వారికి విజ్ఞానంతోపాటు వినోదం కూడా అందుతుంది. విద్యార్థుల్లో శాస్త్ర, వైజ్ఞానిక స్వభావం పెంపొందుతుందని ఆయన వివరించారు. ఈ స్టెప్‌లో భాగంగా సంప్రదాయ రీతుల్లో వ్యవసాయ అభివృద్ధి (ఆర్గానిక్ ఫార్మింగ్) చేపడుతున్న ఫార్మ్‌లకు విహారం, ప్రతిభ ప్రదర్శన (ట్యాలెంట్ షో), క్రీడల దినోత్సవం (స్పోర్ట్స్ డే) వంటి వినోదాత్మక, ఆరోగ్యానికి అవసరమైన కార్యక్రమాలను కూడా చేపడతారు. వీటిని విజయవంతంగా ఆచరణలో పెట్టడానికి ట్రిపుల్ ఐటీ హైదరాబాద్‌లోని 'సైన్సేషన్' అనే సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ పాఠశాల విద్య తర్వాత ప్రశ్నించడం ద్వారా అభ్యసించడం, సమస్యల పరిష్కారం వంటి నైపుణ్యాలను ప్రత్యేక పద్ధతుల్లో విద్యార్థులకు నేర్పిస్తుంది. అదే లక్ష్యంగా స్టెప్ కార్యక్రమాలు రూపొందాయి. విద్యార్థుల్లో కళాభివృద్ధికి ప్రఖ్యాత విద్యాసంస్థ శాంతినికేతన్ నుంచి కూడా అధ్యాపకులను ట్రిపుల్ ఐటీ పిలిపిస్తుంది. గతంలో ఈ కార్యక్రమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులు వివిధ జాతీయ స్థాయి ఒలింపియాడ్‌ల్లో చక్కటి ప్రతిభను ప్రదర్శించడం స్టెప్ సత్ఫలితాలను ఇస్తోందనడానికి నిదర్శనమని నిర్వాహక బృందం అంటోంది.

ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్

అభ్యర్థులు ముందుగా ఆన్‌లైన్‌లో రిజిస్టర్ చేసుకోవాలి. మొదట వచ్చిన వారికి మొదట విధానంలో సీట్లు భర్తీ చేస్తారు. తర్వాత నిర్ణీత ఫీజును చెల్లించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ముగించాలి. రిజిస్ట్రేషన్ పూర్తి చేయడం కోసం మూడు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలు, 2017-18 విద్యా సంవత్సరానికి చెందిన ప్రోగ్రెస్ రిపోర్టు, అడ్రస్ ప్రూఫ్, ఐడీ ప్రూఫ్, బర్త్ సర్టిఫికెట్ సమర్పించాల్సి ఉంటుంది.

భోజనం, హాస్టల్ వసతులు లేవు. ఇది పూర్తిగా నాన్-రెసిడెన్షియల్ ప్రోగ్రామ్. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రోజూ శిక్షణ ఇస్తారు. భోజనం, ఇతర సౌకర్యాలు ఎవరికి వారే ఏర్పాటు చేసుకోవాలి. వందశాతం హాజరు తప్పనిసరి. గైర్హాజరు కావాలంటే ప్రోగ్రామ్ మేనేజర్‌కి ముందస్తు సమాచారం ఇచ్చి అనుమతి పొందాలి. దరఖాస్తుకు చివరి తేదీ ఏప్రిల్ 23. కోర్సు ముగించిన విద్యార్థులందరికీ సర్టిఫికెట్ ఇస్తారు. ఈ కోర్సు 7 మే, 2018న ప్రారంభమై 1 జూన్ 2018న ముగుస్తుంది.

ఈ కోర్సుకి కావాల్సిన ఏకైక అర్హత విశ్లేషణాత్మకమైన, తార్కికమైన ఆలోచనల పట్ల అభిరుచి, అటువంటి వాటిని పెంచుకోవాలనే ఉత్సాహం ఉండటమే!

వెబ్‌సైట్: www.iiit.ac.in/step/ ●

నోటీస్ బోర్డు

◆ ప్రభుత్వ ఉద్యోగాలు ◆

ఇండియన్ బ్యాంకులో స్పెషలిస్ట్ ఆఫీసర్లు

ఇండియన్ బ్యాంకుకు చెందిన ఐటీ, ట్రెజరీ, రిస్క్ మేనేజ్‌మెంట్, సెక్యూరిటీ తదితర విభాగాల్లో స్పెషలిస్ట్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తులు.

పోస్టులు: ఏజీఎం, ఛీఫ్ మేనేజర్, మేనేజర్, సీనియర్ మేనేజర్, అసిస్టెంట్ మేనేజర్.

ఖాళీలు: 145.

అర్హత: డిప్లొమా, బ్యాచిలర్స్ డిగ్రీ, పీజీ, సీఏ/ఐసీడబ్ల్యూఏ ఉత్తీర్ణతతో పాటు సంబంధిత రంగంలో పని అనుభవం ఉండాలి.

ఎంపిక: ప్రిలిమినరీ స్క్రీనింగ్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా.

ఆన్‌లైన్ దరఖాస్తు ప్రక్రియ: 10.04.2018 నుంచి 02.05.2018.

వెబ్‌సైట్: www.indianbank.in

తెలంగాణలో అంగన్‌వాడీ టీచర్లు

తెలంగాణ మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖకు సంబంధించి కింది జిల్లాల ఐసీడీఎస్ ప్రాజెక్టుల్లో అంగన్‌వాడీ పోస్టులకు మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు.

జిల్లాలు: జనగామ, వరంగల్ రూరల్, మహబూబాబాద్, ఆదిలాబాద్, కొమరం భీం-ఆసిఫాబాద్.

పోస్టులు: అంగన్‌వాడీ టీచర్, మినీ అంగన్‌వాడీ టీచర్, ఆయా.

అర్హత: పదోతరగతి ఉత్తీర్ణత.

వయసు: 21-35 ఏళ్ల మధ్య ఉండాలి.

ఎంపిక: పదో తరగతి మార్కులు, తదితర నిబంధనల ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్.

జిల్లాల వారీగా దరఖాస్తు చివరితేదీలు: జనగామ- 04.04.2018, వరంగల్ రూరల్- 10.04.2018, మహబూబాబాద్- 11.04.2018, ఆదిలాబాద్- 13.04.2018, కొమరం భీం- 16.04.2018.

వెబ్‌సైట్: http://wdcw.tg.nic.in/

కలెక్టర్ కార్యాలయం, రంగారెడ్డి జిల్లా

పలు శాఖల్లో బ్యాక్‌లాగ్ (దివ్యాంగులు) పోస్టుల భర్తీకి రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయం దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు–ఖాళీలు: టైపిస్ట్-3, జూనియర్ అసిస్టెంట్-2, ఫార్మసిస్ట్-1, ఎంపీహెచ్‌ఏ-8.

అర్హత: పదోతరగతి, ఇంటర్, డీఫార్మసీ, ఎంపీహెచ్‌ఏ ట్రైనింగ్ సర్టిఫికెట్, బ్యాచిలర్స్ డిగ్రీ, హయ్యర్ టైప్‌రైటింగ్.

వయసు: 01.07.2018 నాటికి 18 నుంచి 54 ఏళ్ల మధ్య.

దరఖాస్తు: ఆన్‌లైన్.

చివరితేది: 13.04.2018.

వెబ్‌సైట్: www.rangareddy.telangana.gov.in

ఎయిమ్స్, భోపాల్

సంస్థ: ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్), భోపాల్.

పోస్టులు: మెడికల్ సోషల్ సర్వీస్ ఆఫీసర్, డైటీషియన్, ప్రైవేట్ సెక్రటరీ, సోషల్ వర్కర్, ఆఫీస్ అసిస్టెంట్, స్టోర్ కీపర్, రేడియోగ్రాఫిక్ టెక్నీషియన్ తదితరాలు.

ఖాళీలు: 171

అర్హత: ఇంటర్, జీఎన్ఎం, డిప్లొమా, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

ఎంపిక: రాతపరీక్ష, స్కిల్/ ప్రొఫీషియన్సీ టెస్ట్ ఆధారంగా.

దరఖాస్తు: ఆన్‌లైన్.

చివరితేది: 03.05.2018

వెబ్‌సైట్: www.aiimsbhopal.edu.in

◆ వాక్ ఇన్స్ ◆

కేంద్రీయ విద్యాలయం, యూవోహెచ్ క్యాంపస్

యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ క్యాంపస్‌లోని కేవీలో ఒప్పంద ప్రాతిపదికన కింది పోస్టుల భర్తీ కోసం వాక్ ఇన్ ఇంటర్వ్యూలు.

పోస్టులు: టీజీటీ (హిందీ/ సంస్కృతం/ తెలుగు/ గణితం/ సైన్స్), స్పోర్ట్స్ కోచ్, యోగా/ కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, నర్సు, ఎడ్యుకేషన్ కౌన్సెలర్, డేటా ఎంట్రీ ఆపరేటర్.

ఖాళీలు: 11.

అర్హత: ఇంటర్, టైపింగ్ పరిజ్ఞానం, డిప్లొమా, డిగ్రీ, బీఈడీ, ఎంఎస్సీ, సీటెట్ ఉత్తీర్ణత.

ఇంటర్వ్యూ తేది: 06.04.2018.

వేదిక: కేంద్రీయ విద్యాలయం, యూవోహెచ్ క్యాంపస్, హైదరాబాద్.

వెబ్‌సైట్: www.kvhcu.org

◆ ప్రవేశాలు ◆

కేయూ దూరవిద్యలో బీఏ, బీకాం కోర్సులు

కాకతీయ విశ్వవిద్యాలయం దూరవిద్యలో బీఏ, బీకాం (జనరల్, కంప్యూటర్స్) కోర్సులకు ప్రవేశార్హత పరీక్ష-2018.

అర్హత, ఎంపిక: 30.06.2018 నాటికి 18 ఏళ్లు నిండి ప్రవేశార్హత పరీక్ష ఉత్తీర్ణులైనవారు, 2015 నుంచి 2017 వరకు గతంలో నిర్వహించిన అర్హత పరీక్షలో ఉత్తీర్ణులైన వారు లేదా ఇంటర్మీడియట్, తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన వారు అర్హత పరీక్ష రాయకుండానే ప్రవేశం పొందవచ్చు.

దరఖాస్తు: ఆఫ్‌లైన్.

చివరితేది: 21.05.2018.

ప్రవేశపరీక్ష తేది: 03.06.2018.

వెబ్‌సైట్: www.sdlceku.co.in

వీఎస్‌యూపీజీసెట్-2018

నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం, అనుబంధ కళాశాలల్లో 2018-19 విద్యాసంవత్సరానికిగానూ పీజీ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పరీక్ష.

కోర్సులు: ఎంఏ, ఎంకాం, ఎంఎస్సీ, ఇంటిగ్రేటెడ్, డిప్లొమా తదితరాలు.

అర్హత: ఇంటర్మీడియట్, బ్యాచిలర్స్ డిగ్రీ.

దరఖాస్తు: ఆన్‌లైన్.

చివరితేది: 30.04.2018.

వెబ్‌సైట్: www.vsudoa.in